నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 కరీంనగర్, శనివారం 20 ఏప్రిల్ 2024 PEDDAPALLI

# పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ ధనప్రవాహం!

- ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు
- సింగరేణి ఓట్ల కోసం అసత్య ప్రచారాలు
- బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా ప్రలోభాలు
- వినకుంటే ఆత్మవిశ్వాసం దెబ్బతీసేలా కుట్రలు
- బెదిరింపులు.. దాడులు.. కక్షసాధింపు చర్యలు
- ఇటీవల సోషల్ మీడియా వారియర్‌పై కేసులు
- భయభ్రాంతులకు గురిచేసేలా మొన్న కౌన్సిలర్ ఇంట్లో సోదాలు
- పోలీసులు అండగా నిలుస్తున్నారనే విమర్శలు

తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పట్టుకోసం ప్రయత్నిస్తున్నది. ఎలాగైనా సరే ఈ ఎన్నికల్లో జెండా ఎగరేయాలన్న ఉబలాటంతో అడ్డదారులు తొక్కుతున్నది. అందుకోసం ధన ప్రవాహాన్ని పారించడమే కాకుండా.. బీఆర్ఎస్ నాయకుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా కుట్రలు చేస్తున్నది. ఎరవేస్తూ పార్టీలో కలుపుకొంటుండగా.. నికార్సయిన నాయకులు ఎదురొడ్డి నిలుస్తుండడాన్ని జీర్ణించుకోలేక పోతున్నది. ఈ క్రమంలో తమ దారికి రానివారిని, లొంగదీసుకునేందుకు ఎంతకైనా ఒడిగడుతున్నది. అంతేకాదు, హస్తం పార్టీ పాలనలో వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గులాబీ సోషల్ మీడియా వారియర్స్‌పై దాడులకు తెగబడుతున్నది. పోలీసులను అడ్డుగా పెట్టుకొని లేనిపోని కేసులు పెడుతూ జైలు పాలు చేస్తున్నది. అందుకు ధర్మారం మండలం బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వాజి మాధవరావు ఉదంతమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఇది జరిగి రెండు మూడు రోజులైనా కాకముందే సుల్తానాబాద్‌లో కౌన్సిలర్ లక్ష్మీమల్లయ్య ఇంట్లో పోలీసులు సోదాల పేరిట అలజడి సృష్టించడం కక్ష సాధింపు చర్యలకు అద్దం పడుతున్నది. ఇలా ప్రలోభాలకు గురి చేయడం, లొంగకుంటే బెదిరింపులకు దిగుతున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.


మాధవరావు


గురువారం దవాఖానలో కౌన్సిలర్ లక్ష్మి

కరీంనగర్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం (ఎస్సీ రిజర్వ్‌డ్) పరిధిలో పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథనితోపాటు మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడింటికి ఐదు సెగ్మెంట్ల పరిధిలో సింగరేణి విస్తరించి ఉండగా, నాడు ఉమ్మడి పాలనలో ఈ ప్రాంతంపై చిన్నచూపు కొనసాగింది. కానీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమల్లోకి తెచ్చారు. ప్రతి కార్మికుడికీ ప్రయోజనం కలిగేలా కార్యక్రమాలు చేపట్టారు. ఇటు రూ.కోట్లాది నిధులతో ఈ ప్రాంతంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. ఇదంతా కండ్లముందే కనిపించడంతో ప్రజలు కేసీఆర్‌కే జైకొట్టారు. లోక్‌సభ స్థానం ఏర్పడినప్పటి నుంచి చూస్తే.. తెలంగాణ రాక ముందు వరకు మెజార్టీ సమయాల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని అందించినా.. రాష్ట్ర ఏర్పాటు నుంచి మాత్రం బీఆర్ఎస్‌కు పట్టం కడుతూ వచ్చారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బాల్క సుమన్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్‌పై 2.91 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి రికార్డు సృష్టించారు. ఈ ఎన్నికల్లో 56.82 శాతం ఓట్లు బీఆర్ఎస్‌కు రాగా, కాంగ్రెస్‌కు కేవలం 27.57 శాతం వచ్చాయి. 2019 ఎన్నికల్లో వెంకటేశ్ నేతకాని కాంగ్రెస్ అభ్యర్థి ఆగమ్ చంద్రశేఖర్‌పై 95 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 45.49 శాతం ఓట్లు గులాబీ పార్టీకి రాగా, 35.68 శాతం హస్తం పార్టీకి వచ్చాయి.

### 'కొప్పుల' హవా

ఈ ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగరేయాలన్న లక్ష్యంతో ప్రజల సమస్యలే ఎజెండాగా పోరాడే వ్యక్తిత్వమున్న సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను బీఆర్ఎస్ బరిలోకి దింపింది. కాంగ్రెస్ గడ్డం వంశీకృష్ణను, బీజేపీ గోమాస శ్రీనివాస్‌ను బరిలోకి దింపాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే బీఆర్ఎస్ ఇక్కడ బలంగా ప్రచారం చేస్తున్నది. సింగరేణితో ఉన్న సంబంధాలతోపాటు ప్రజలతో మమేకం అవుతున్న తీరుతో కొప్పులకు మంచి స్పందన వస్తున్నది. ఎక్కడ చూసినా హవా కనిపిస్తున్నది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, సింగరేణి సమస్యలపై అవగాహనతోపాటు ఈప్రాంతంపై పూర్తి పట్టు ఉండడంతో కొప్పులకు అండగా నిలిచేందుకు జనం కదులుతున్నది. తొలి తెలంగాణ సీఎంగా కేసీఆర్ అమలు చేసిన ఎన్నో పథకాల నేపథ్యంలో కొప్పుల వైపు కార్మికలోకం చూస్తున్నది.

### 'హస్తం'లో భయం

కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు సుదీర్ఘ రాజకీయ అనుభవం లేదు. ఇప్పటివరకు చట్టసభలకు వెళ్లలేదు. సింగరేణి సమస్యలపై పెద్దగా అవగాహన లేదు. ఎమ్మెల్యే వివేక్ కొడుకుగానే తప్ప పెద్దగా ప్రజల్లో పేరు లేదు. ఇదే సమయంలో కొప్పులతో హస్తం పార్టీ అభ్యర్థిని పోల్చి చూస్తున్నారు. ఏ అంశంలోనూ ఈశ్వర్‌కు తులతూగడం లేదన్న అభిప్రాయాలు బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈశ్వర్‌తో కంపేర్ చేసి ప్రచారం చేయలేని పరిస్థితి కాంగ్రెస్‌కు ఏర్పడుతున్నది. మరోవైపు ఒకే కుటుంబానికే అవకాశం ఇస్తారా..? అన్న భావన ఆ పార్టీ నాయకుల్లోనూ కనిపిస్తున్నది. వీటన్నింటినీ లోతుగా పరిశీలించిన ప్రధాన నేతల్లో ఓడిపోతామనే భయం మొదలైంది.

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం మొదట్లో కాంగ్రెస్‌కే కంచుకోటగా ఉండేది. కానీ, తెలంగాణ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంత ప్రజానీకం బీఆర్ఎస్‌కే జై కొడుతున్నది. ఇది ఓర్వలేక హస్తం పార్టీ కుట్రలకు తెర తీస్తున్నది. ఎన్నికల వేళ ఓవైపు భారీగా ధన ప్రవాహం పారిస్తున్నట్టు తెలుస్తుండగా.. మరోవైపు వినని వారిని కేసులతో భయపెడుతున్నది.

### వినకుంటే కేసులు?

బీఆర్ఎస్ తరపున నిలబడి పోరాడుతున్న వారిని టార్గెట్ చేసి.. ఏదో రకంగా దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. తమ ప్రలోభాలకు లొంగకపోతే టార్గెట్ చేసి మరీ వెంటాడుతున్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రశ్నించే గొంతుకలపై కుట్రలు చేస్తున్నారు. ఎదురుతిరిగి అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించిన వారిని లేనిపోని కేసులతో భయపెడుతున్నారు. ఇటీవల ధర్మారం మండలానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సల్వా జీ మాధవరావుపై కేసులు పెట్టి జైలు పాలు చేశారు. సాగునీరు లేక పంటలు ఎండిపోవడంలో ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడు తూ సోషల్‌మీడియాలో పోస్టు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ముందుగా ఆ యు వకుడిపై దాడి చేశారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోక పోగా.. ఆ తర్వా త అతనిపైనే అట్రాసిటీ కేసులు పెట్టి జైలు పాలు చేశారు. ఈ విషయంలో పోలీసుల తీరుపై స్వయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది జరిగి రెండు మూడు రోజులు కాకముందే సుల్తానాబాద్‌లోని కౌన్సిలర్ లక్ష్మి ఇంట్లో పోలీసులు దౌర్జన్యం చేయడం కక్షసాధింపు చర్యలకు అద్దం పట్టింది. ఎలాంటి సెర్చ్ వారెంట్ ఇవ్వకుండా.. మహిళా పోలీసులు లేకుండా దాదాపు రెండు మూడు గంటలపాటు సోదాలతో భయానక వాతావరణం సృష్టించారు. తమ ఇంట్లో ఎందుకు తనిఖీలు చేస్తున్నారని కౌన్సిలర్ కొడుకు ప్రశ్నిస్తే బైండోవర్ చేస్తామంటూ బెదిరించారు. లో బీపీతో బాధపడుతున్న కౌన్సిలర్ లక్ష్మి ఒక్కసారిగా కుప్ప కూలినా పట్టించుకోలేదు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. రాత్రి వరకు కో లుకున్నది. ఇలా కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటాడుతున్నారు. మరి కొన్ని మండలాల్లోనూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

### బీఆర్ఎస్ సీరియస్

నికార్సయిన బీఆర్ఎస్ నాయకులు మాత్రం హస్తం పార్టీ బేరసారాలకు లొంగడం లేదు. కొంతమంది మాత్రం కేసీఆర్ పదేళ్ల పాలనలో వివిధ పదవులు అనుభవించి, ప్రస్తుతం ప్రలోభాలకు ఆశపడిపోవడం చూసి ప్రజలే అసహ్యించుకునే పరిస్థితులు ఉన్నాయి. 'అందితే జుట్టు.. లేదంటే కాళ్లు' అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం పార్టీ మారుతున్న నాయకులకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పుట్టగతులుండవని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మోసాలు, కుట్రలకు పెట్టింది పేరుగా నిలిచిన కాంగ్రెస్ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా.. మరింత దిగజారుతున్నది. తన కుతంత్రాలను రోజురోజుకూ పెంచుకుంటూ పోతుండగా.. బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటున్నది. దాడులు, అక్రమ కేసులపై తగ్గేది లేదని స్పష్టం చేస్తున్నది. కాంగ్రెస్ తీరుపై ఈసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నది. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అభయమి స్తున్నది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ శుక్రవారం ఉదయం కరీంనగర్ జైలులో ఉన్న సల్వాజీ మాధవరావును పరామర్శించి, ధైర్యం చెప్పారు. సాయంత్రం సుల్తానాబాద్‌లోని 9వ వార్డు కౌన్సిలర్ గొట్టం లక్ష్మీమల్లయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఎలాంటి వేధింపులకు గురిచేసినా అధైర్య పడవద్దని, పార్టీ పరంగా ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

### గెలుపు కోసం అడ్డదారులు

ఈశ్వర్ హవాతో భయంలో పడ్డ కాంగ్రెస్ నాయకులు, ఈసారి ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులనే ఆయుధంగా చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ వరుస విజయాలకు బ్రేకులు వేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. ఓవైపు సింగరేణి కార్మికులను పక్కదారి పట్టించేందుకు విష ప్రచారం చేస్తూనే.. మరోవైపు గులాబీ నాయకులను తమవైపు తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో ధనప్రవాహం పారిస్తున్నట్టు తెలుస్తున్నది. తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు ఇలా అన్ని రంగాల్లోని బీఆర్ఎస్ నాయకులకు గాలం వేసి, నైతికంగా దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నది. ముందుగా ప్రలోభాలకు గురిచేయడం.. ఒకే అంటే పార్టీలో చేర్చుకోవడం.. లేదంటే భయపెట్టడం పరిపాటిగా మారింది. ఇప్పటికే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలా మంది నాయకులను హస్తం పార్టీలో చేర్చుకోగా.. కొంత మందికైతే కాంట్రాక్టు ఆఫర్లు ఇస్తున్నట్లు తెలుస్తున్నది.

---

# రెండో రోజు నామినేషన్ల జోరు

- పెద్దపల్లిలో ముగ్గురు, కరీంనగర్‌లో ఒకరు, నిజామాబాద్‌లో ఏడుగురు
- అట్టహాసంగా దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు

పెద్దపల్లి, ఏప్రిల్19(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు నామినేషన్లు జోరుగా దాఖలయ్యాయి. పెద్దపల్లిలో ముగ్గురు, కరీంనగర్‌లో ఒకరు, నిజామాబాద్‌లో ఏడుగురు నామినేషన్లు వేశారు. కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తరపున పార్టీ నాయకులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పెద్దపల్లిలో బీఆర్ఎస్ తరపున కొప్పుల ఈశ్వర్(రెండు సెట్లు), కాంగ్రెస్ తరపున గడ్డం వంశీ కృష్ణ (రెండు సెట్లు), బీఆర్ఎస్ తరపున కొంకటి లింగమూర్తి (ఒక సెట్) నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. నిజామాబాద్‌లో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాగా, బీఆర్ఎస్ తరపున బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ దాఖలు చేశారు.

---



నేను ఇక్కడే పుట్టిన. ఇక్కడే పెరిగిన. నా చివరి శ్వాస వరకూ మీతోనే ఉంట. ఒక కార్మికుడి బిడ్డను. అన్నా.. అంటే నేనున్నాననే మీ సోదరుడిని. మీతో అంతటి అనుబంధం ఉన్నది. మీ బిడ్డను ఎంపీగా ఆదరించండి. మీకోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా. ఈ ఎన్నికల్లో ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ జరుగుతున్నది. నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి చేసి చూపిస్తా.

**- రోడ్‌షోలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**

# మీకోసం ప్రశ్నించే గొంతుకనవుతా


నామినేషన్ అనంతరం రోడ్ షోకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పక్కన ఎమ్మెల్సీ భానుప్రసాద రావు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- నా చివరి శ్వాస వరకూ మీతోనే ఉంటా
- అన్నా.. అంటే మీ సోదరుడిగా నేనున్నా
- ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ
- మీ బిడ్డకు అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి : కార్మిక, కర్షకుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతానని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కావాలని, తనకు ఆ అవకాశాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తర్వాత నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రోడ్‌షోకు హాజరయ్యారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి అశేషంగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రశ్నించే గొంతుకలపైన రేవంత్ సర్కార్ అక్రమ కేసులను పెడుతున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేకుండా పోయాయని, ధర్మారంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సల్వాజీ మాధవరావుపై దాడిని ఉదహరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కానీ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సాగు నీరందక, కరెంటు రాక రైతులు అన్నమో రామచంద్రా.. అని ఆర్తనాదాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. అయినా, సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 209 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోవాలాల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కుటుంబ పో షణ గడవక 48 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా రాష్ట్ర సర్కారుకు ఏ మాత్రం కనికరం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీరు అందించారని, ధాన్యం సకాలంలో కొన్నారని కొనియడారు. కానీ, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి పది రోజులైనా కొనే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్‌కు సెగ తాకేలా పోస్టు కార్డు ఉద్యమాన్ని గ్రామ గ్రామాన చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానికుడినైన తనకు ఎంపీగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇచ్చి కేసీఆర్ విధానాలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పెద్దపల్లి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, దుర్గం చిన్నయ్య, నడిపెల్లి దివాకర్‌రావు, నాయకులు రఘువీర్‌సింగ్, దాసరి ఉష, గంట రాములు, మిర్యాల రాజిరెడ్డి, మేకల మల్లేశం తదితరులు ఉన్నారు.

### అట్టహాసంగా కొప్పుల నామినేషన్

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 10 గంటలకు పెద్దపల్లికి చేరుకున్న ఆయన, తొలుత బస్టాండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం మహిళలు ఆయనకు కుంకుమ తిలకం దిద్దగా, ముస్లింలు దట్టీ కట్టారు. అక్కడి నుంచి నామినేషన్‌కు కలెక్టరేట్‌కు బయలుదేరి వచ్చారు. 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్‌ఖాన్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. కలెక్టరేట్ ఎదుట మీడియాతో మాట్లాడారు. తర్వాత నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా చేరుకుని, అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్ షో నిర్వహించారు. నామినేషన్ సందర్భంగా పార్లమెంట్ పరిధిలోని బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'జై కేసీఆర్' 'జైకొప్పుల' నినాదాలతో హోరెత్తించారు.

---

# వేడుకలా 'బాజిరెడ్డి నామినేషన్'

- నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా దాఖలు

ఖలీల్‌వాడి/జగిత్యాల, ఏప్రిల్ 19 : నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం పండుగ వాతావరణంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. జగిత్యాల జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లగా, ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ వసంత పాల్గొన్నారు.


బాజిరెడ్డి గోవర్ధన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, పక్కన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, తదితరులు

### రేవంత్‌రెడ్డి ఝూటా కోర్

కాంగ్రెస్, బీజేపీ నాయకులు అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నరు. ఆ పార్టీలను మరోసారి నమ్మితే చెవిలో పువ్వు, నెత్తిన చెయ్యిపెట్టి నిండా ముంచుతరు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన పసుపు బోర్డు ఎటు పోయింది? పొద్దున లేస్తే ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, హిందూ, ముస్లిం వ్యాఖ్యలతో ప్రజలను రెచ్చగొట్టడమే తప్ప ప్రజలకు చేసింది శూన్యం. రాముడి సద్గుణాలను ఆచరించాలే గానీ రామనామజపంతో రాజకీయం చేయడమేంటి? మోదీ పేదలకు పంచుతానన్న నల్లధనం ఎటుపోయింది? ఒకే కుటుంబంలో తండ్రీ కొడుకులు ఎంపీలుగా పనిచేసి జిల్లాకు చేసిందేమీ లేదు. అందుకే అర్వింద్ గ్రామాల్లో తిరిగినప్పుడు ప్రజలు తిరగబడి కొట్టిన్రు. ఈ ఎన్నికల్లో ఓటుతోనే గుణపాఠం చెప్పాలి. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఏనాడైనా జిల్లాకు వచ్చాడా..? రేవంత్‌రెడ్డి ఝూటాకోర్. ఆయన దొంగ హామీలిచ్చి గద్దెనెక్కిండు. అధికారంలోకి వచ్చినవెంటనే రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి 135 రోజులు గడుస్తున్నా అమలు చేయలేదు. ఇప్పుడు పంద్రాగస్టు వరకు మాఫీ చేస్తామని మళ్లీ అబద్ధాలు చెబుతున్నడు. నన్ను 40 ఏండ్లుగా ప్రజలు ఆదరిస్తున్నరు. అందుకే రాజకీయాల్లో ఉంటూ సేవచేస్తున్న. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించండి. నేను గెలిస్తే కొట్లాడి నిధులు తెస్త.

**- బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి**

---


వీర్నపల్లి : లాల్‌సింగ్ తండా కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

# అకాల వర్షం.. రైతన్న ఆగం

వీర్నపల్లి/ ఇల్లంతకుంట/ కోనరావుపేట/ రుద్రంగి ఏప్రిల్19: కొద్ది రోజులుగా భయపెడుతున్న అకాల వర్షం, శుక్రవారం రైతన్నను ఆగమాగం చేసింది. పొద్దంతా ఎండకొట్టినా.. సాయంత్రం ఉరుములు, మెరుపులతో అక్కడక్కడా వర్షం పడింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, ఇల్లంతకుంట, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో ఈదురుగాలులతో వాన పడగా.. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల వరి నేలవాలింది. చేతికొచ్చిన దశలో మామిడి కాయలు నేలరాలాయి. వీర్నపల్లి మండల వ్యాప్తంగా కొనుగోలు సెంటర్లలో 8వేలకుపైగా క్వింటాళ్ల ధాన్యం తడువడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి. ఇల్లంతకుంట మండలం జంగంరెడ్డిపల్లిలో పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన బర్రె పిడుగుపాటుతో మృతి చెందింది.

---

# వరికి బోనస్.. బోగస్

**రుణమాఫీ ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ సాకులు**

- అబద్ధాల పునాదులపైన సర్కారు
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు న్యాయం
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్


ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 19: కాంగ్రెస్ సర్కారు రుణమాఫీని ఎగ్గొట్టేందుకు సాకులు వెతుకుతున్నదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. ఇప్పుడు సీఎం రేవంత్ ఆగస్టు 15లోగా రుణమాఫీ అంటున్నారని, ఆ తర్వాత జనవరి 26 అంటారని ఎద్దేవా చేశారు. వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేశారని విమర్శించారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని, పార్లమెంట్‌లో ప్రజల గొంతుక వినిపించేది గులాబీ పార్టీనేనని స్పష్టం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావుతో కలిసి ఎల్కతుర్తిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను వినోద్ ఎండగట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై ఏర్పడ్డదని విమర్శించారు. మేడిగడ్డ కింద 5వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతుంటే చోద్యం చూస్తున్నదని నిలదీశారు. రైతులు బాగుపడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, అందుకే దేవాదుల నుంచి నీటిని పంపింగ్ చేయడం లేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ కేసులతో ప్రతిపక్షాలను లొంగదీసుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ మాటలు నీటి మూటలయ్యాయన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఎల్కతుర్తి మీదుగా జాతీయ రహదారులను మంజూరు చేయించానని గుర్తు చేశారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేశానని చెప్పారు. కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పించి అభివృద్ధికి వెయ్యి కోట్లు తెచ్చానని చెప్పారు. 9 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అనుమతులు మంజూరు చేయించానని, కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు రైలు మార్గం కోసం కృషి చేశానని తెలిపారు. 24ఏండ్ల నుంచి తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థుల పక్షాన నిలబడాలని ప్రజలను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగు నీరులేని, కరెంట్‌లేని మార్పును చూసి ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన చెందారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించాలంటే తప్పకుండా ప్రజలంతా వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, బండి సంజయ్ ప్రజల మనోభావాలతో రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే ప్రజల అభివృద్ధికి పాటుపడుతారని తెలిపారు. ఈ రోడ్ షోలో బీఆర్ఎస్ హుజూరాబాద్ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.